జాతీయ రక్షణనిధికై తెలుగు సినిమా తారలు ప్రదర్శించిన నాటికలు యువ పఠితలకు ఈ సంచికలో సమర్పిస్తున్నాం.

— ఎడిటర్.

అజ్ఞాత వీరులు (నాటిక)

పద్మరాజు

ప్రదర్శనమున పాల్గొన్నవారు

శ్రీ రంగారావు	మానవేంద్రనాథ బెనర్జీ
శ్రీ జగ్గయ్య	గోపాలరావు
శ్రీమతి కన్నాంబ	పూర్ణిమ
శ్రీమతి సావిత్రి	అపర్ణ

(కలకత్తాలో ఒక మధ్యతరగతి గృహస్థు మానవేంద్రనాథ బెనర్జీ. అరవయ్యోపడి. అతని భార్య పూర్ణిమా బెనర్జీ. అతనికంటె అయిదారు సంవత్సరాలే చిన్నది. ఆ దంపతులకు ఒకే ఒక కొడుకు, కాళీచరణ్ బెనర్జీ. ప్రస్తుతం నీఫా రంగంలో భారతసైన్యములో ఒక చిన్న పటాలానికి కెప్టెన్. బెనర్జీగారి మేనకోడలు కాళీచరణ్ భార్యకానున్న యువతి-అపర్ణ, చిన్నతనంనుంచీ మేనమామ, మేనత్తల సంరక్షణలోనే పెరిగింది. బెనర్జీగారు పదహారుసంవత్సరాలు తెలుగుదేశంలో ఉద్యోగం చేసి పించను పుచ్చుకొని కలకత్తాలో ఆవాస మేర్పర్చుకున్నారు. యుద్ధంలో కాలిమీద దెబ్బతిన్నందువల్ల కాళీచరణ్ స్నేహితుడు – గోపాలరావు అనే తెలుగుయువకుడికి శలవుదొరికిం దొకవారం రోజులు. కాళీచరణ్ అతన్ని కలకత్తా వెళ్ళి తన తల్లిదండ్రుల దగ్గర ఆ వారం రోజులు హాయిగా గడిపి రమ్మని మరీమరీ చెప్పాడు కానీ తల్లిదండ్రులను చూడాలన్న ఆత్రంకొద్దీ గోపాలరావు తన స్వగ్రామమైన చంద్రగిరి వెళ్ళి నాలుగు దినాలు అక్కడ వుండి తిరిగి నీఫా వెళ్ళేముందు తన స్నేహితుని ఆదేశాన్ని మన్నించటానికి బెనర్జీగారియింటికి వచ్చాడు- అక్కడ ఒక్క రోజన్నా ఆ వృద్ధదంపతులతో గడిపి మరీ పోవాలని. అతని రాకతో ఈ నాటకం ప్రారంభం)

[తెరతీయగానే మానవేంద్ర బెనర్జీ పపధ్యానంగా రంగస్థలాన్కి మధ్యగావున్న దివాన్ మీద కూర్చుంటాడు. అది పగలు దివాన్‌గాను, రాత్రి మంచంగాను ఉపయోగిస్తుంది. ఆయనకు ఎడమప్రక్క ఒక రాతబల్ల, దాని వెనక కుర్చీ, కుడిప్రక్క మూలలో ఒక వీణ గోడ నానుకొని; ఆ హాలు చూడగానే నిరాడంబరత స్ఫుటంగా కనబడుతుంది. ఉన్నంతలో జాగ్రత్తగా పరిశుభ్రంగా ప్రతికే కుటుంబమని ఆ యిల్లు అమర్చబడిన పద్ధతే చెబుతుంది. గోపాలరావు మిలటరీ దుస్తుల్లో ప్రవేశం. వచ్చీ రావటంతో తన Kit, కర్ర కుర్చీమీద పెడతాడు. బెనర్జీగా రతన్ని చూడరు.]

గోపాలరావు : అయ్యా! (బెనర్జీ ఉలికి పడతాడు) మానవేంద్రనాధ్ బెనర్జీ గారు మీరేకదండి?

బెనర్జీ. మీరు......!

గో. నా పేరు గోపాలరావు. మీ అబ్బాయి కాశీచరణ్ రాయలేదూ నా గురించి?

బె : రాయకేం! అయితే వారంరోజుల క్రితమే వస్తారనుకున్నాం.

గో : అతడు నాతో అల్లాగే చెప్పాడు. నీకున్న శలవే వారం రోజులు. మీ చంద్రగిరి ఎక్కడో వెయ్యి మైళ్ళ దూరాన వుంది. వెళ్ళిరావడానికి నాలుగు రోజులు పడుతుంది. కలకత్తా వెళ్ళి వారంరోజులు మా అమ్మ నాన్నదగ్గర గడిపేసిరా. వాళ్ళు నిన్ను కడుపులో పెట్టుకుని ఆదరిస్తారు, అన్నాడు. అయితే మా అమ్మనీ నాన్ననీకూడ చూడాలని బుద్ధిపుట్టింది.

బె : అయితే చంద్రగిరి వెళ్ళి వచ్చారన్న మాట.

గో. అవునండి. అందులో ఈ దెబ్బ తగిలేక –

బె : కాలిమీద పెద్ద గాయమే పడిందట కదూ?

గో : అంత పెద్ద గాయం కాదులెండి (పాంటు పైకెత్తి చూపిస్తాడు ప్లాస్టరు చుట్టి వుంటుంది) మా అమ్మ నన్ను చూడాలని వుందని మరీ మరీ వ్రాసింది.

బె : మంచిపని చేశారు. ఇలాకూర్చోండి ఒక్క క్షణంలో వస్తాను.

గో : అమ్మగారేరీ?

బె : లోపలుంది. పూర్ణిమా! (పూర్ణిమా బెనర్జీ వస్తుంది)

గో అమ్మగారూ! (గోపాలరావు యిద్దరికీ సాష్టాంగ నమస్కారం చేస్తాడు. పూర్ణిమ ముఖం మీద ముసుగు సరిచేసుకొని వెనక్కు తగ్గుతుంది) మీ దేశాచార ప్రకారం బిడ్డలు తల్లిదండ్రులకి యిలా గె నమస్కారం చేస్తారటగా!

బె : పూర్ణిమా! వీరే గోపాలరావుగారు మన కాశీ రాయలా!

పూర్ణిమాబెనర్జీ : అనుకున్నాను. అలా కూర్చోండి బాబూ!

గో. మీ కాశీ ఒకటి నేనొకటీ కాదు నన్ను, మీరు మీరు అని మన్నిస్తుంటే నాకు చిన్నతనంగా వుంది.

బె కూర్చో నాయనా, అలా కూర్చో.

పూ కూర్చోనాయనా...కాఫీ తెస్తాను.

గో మీరిలా కూర్చోండి అమ్మగారూ! ఆ ఏర్పాట్లన్నీ సావకాశంగా చేయొచ్చు (పూర్ణిమను దివాన్ మీద కూర్చోబెట్టి తను క్రింద కూర్చుంటాడు ఆమె కాళ్ళదగ్గర.)

పూ అయ్యో అదేమిటి? క్రింద కూర్చున్నావ్?

గో నన్నిలా మీ కాళ్ళదగ్గర కూర్చోనిస్తే చాలు. అదే అన్నిటికన్నా మీరు చేయగల గొప్ప మర్యాద. బాబుగారలా నిఃబడే వున్నారేమిటి?

బె వస్తాను...ఏదో అనుకొని మర్చిపోయాను...(లోపలికి వెళతాడు.)

పూ చాలా దూర ప్రయాణం చేసి వచ్చావు నాయనా! కాస్సేపు విశ్రాంతి తీసుకో.

గో మీతో కులాసాగా కబుర్లు చెబుతూ కూర్చుంటే అంతకన్నా విశ్రాంతి ఎం కావాలి?

పూర్ణిమ : నాయనా! దేశం కాని దేశంలో ప్రతిక్షణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆ చైనా దురంతకులతో యుద్ధం చేస్తున్నారు మీరు. ఆ మంచు కొండలమధ్య వేళపట్టున తిండి, నిద్రలేకుండా ఎన్ని కష్టాలయినా పడుతున్నారు. ఇంటికొచ్చినప్పుడైనా మీరు కాస్త తృప్తిగా తిని, విశ్రాంతిగా నిద్రపోవాలని మా ఆదుర్దా.

గో : (లేచి మెల్లగా పచారు చేస్తూ) అమ్మగారూ! మేమక్కడ పడుతున్న బాధలు మీ రంచనా వేయలేరు. మాకు కావలసిన విశ్రాంతి ఎటువంటిదో కూడా మీరు అంత సులభంగా తెల్సుకోలేరు. గాలిలో నీరు కూడా గడ్డకట్టుకుపోయే ఆ హిమాలయాల్లో నోరు తడియారిపోయినప్పుడు మురికి నీరయినా అమృతప్రాయంగా ఉంటుంది. కటికి రాళ్ళమీద దొర్లిన శరీరానికి గడ్డి, ఆకులు హంసతూలికలవుతాయి. మీ వద్ద మేమాశించేది శరీరసౌఖ్యం కాదు. మనస్సుకి విశ్రాంతి; ఆత్మకి స్థైర్యం; హృదయానికి ఆదరం, అనురాగం.

పూ : ఆదరానికీ అనురాగానికీ లోటేమీ లేదు నాయనా!

గో : నాకు తెలుసు. అందుకే అంత ఆశగా మీ దగ్గర కొచ్చాను. మీరు కాశీ తలిదండ్రులు. కాశీచరణ్ నా ప్రాణానికి ప్రాణం.

పూ : అబ్బాయి రాశాడు

గో : బోండిలాలో మా మొదటి పరిచయం. నా కాలికి గుండుదెబ్బ తగిలింది. తక్కిన సైన్యమంతా అతి వేగంగా వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. కాశీ మాత్రం నన్ను వదలిపోలేకపోయాడు. చైనా శతఘ్నులు దారినంతా నాశనం చేశాయి దారీ తెన్నూ లేని ఆ మంచుకొండల్లో లోయల్లో

అడవుల్లో మూడు రోజులు నన్ను, తన భుజం మీద మోసుకొచ్చి మా శిబిరం చేర్చాడు కాశి. ఈ ప్రాణం అతనిది. ఈ బ్రతుకే అతనిది.

బె : (గోపాలరావు చెబుతుండగా ఆఖరున వచ్చి వింటాడు) ఎప్పుడొచ్చేదీ ఉత్తరం వ్రాస్తే స్టేషను కొచ్చేవాణ్ణి.

గో : వచ్చి ఏం లాభం ! కలకత్తా స్టేషన్లో యీ కోన్కిస్కా గోపాల

రావుని మీరు పట్టుకోవడం ఎల్లా ? అందుకే కాశీతో అన్నాను. కలకత్తాలో మీ యింటి ఎడ్రసు నాకియ్యి, నేనే కనుక్కొని వెడతా నన్నాను.

బె : యుద్ధరంగంలో ఏర్పడ్డ అనుబంధాలు చాలా అపురూపమైనవి.

(అపర్ణ కప్పుతో కాఫీ తెచ్చి గోపాలరావు కిస్తుంది.)

పూ : మా మేనకోడలు.

గో : అపర్ణ. మా కాశి తన మరదల్ని గురించి అందులో తనకు కాబోయే భార్యను గురించి నాతో చెప్పకుండా ఎలా వుంటాడు ?

పూ : వంట సంగతి చూడాలి. (ఆమె తొందరగా వెళ్లను)

అ : చల్లారిపోతుంది. ముందు త్రాగండి.

గో : ఎంత చల్లారిపోయినా మాకు వేడిగానే వుంటుంది. ఆ మంచుకొండల మధ్య వెచ్చదనం కోసం తపస్సు చేశామంటే నమ్మండి. (కొంచెం చప్పరించి) కాఫీయా? నా కోసం ప్రత్యేకంగా చేసినట్టున్నారు. మీకు 'టీ' అలవాటు అనుకుంటాను.

బె : అయితే కాఫీ మాకు కొత్తకాదు నేను తెలుగుదేశంలో 16 సంవత్సరాలు ఉద్యోగం చేశాను.

గో : కాశీ చెప్పాడు. అందుకే మీరింత చక్కగా తెలుగు మాట్లాడుతున్నారు, అపర్ణాదేవికూడా అక్కడే పెరిగిందటగా ?

బె : అవును.

గో . నాలెక్కప్రకారం మీరు తెలుగు వారే.

బె : నిజమే కానీ నేను పుట్టి పెరిగినదేశం ఇది. బంధువులంతా యిక్కడే వున్నారు. అంచేత రిటైరవగానే ఇక్కడకొచ్చి స్థిరపడ్డాను.

గో : మీరెక్కడ ఉద్యోగంచేశారు?

బె : అంతా—రాజమండ్రి, కాకినాడ, బెజవాడ, గుంటూరు — కాఫీ ఏలాగుంది నాయనా !

గో : చాలా బాగుంది అయితే యుద్ధంలో చేరాక కాఫీకీ టీకి తేడాతెలియడం మానేసింది, నాకోసం ప్రత్యేకంగా కాఫీ చేయడం అనవసరం.

అ . అథమం యింటికొచ్చినప్పుడైనా, మీ నోటికి రుచినేర్పి పంపాలిగదా మేము.

గో : అయితే యుద్ధం పూర్తికాగానే కాశీతోవచ్చి వారంరోజులుంటాను.

బె : అమ్మాయ్ ! నీళ్ళగదిలో వేడి నీళ్ళున్నాయా ?

అ : ఆఁ అన్నీ సిద్ధంచేశాను.

బె : ఇదే నాయనా ! ఈ నడవలో ఎడం ప్రక్కదే నీళ్ళగది. తువ్వాలూ సబ్బూ అన్నీ అక్కడే ఉంటాయి. (గోపాలరావుని భుజంమీద చేయివేసి లోపలికి తీసుకు వెడతాడు. ఈలోగా

అపర్ణ మూలనున్న వీణ తీసుకుని బయటికి వెళ్ళబోతుంది.) అమ్మాయ్! ఎక్కడికి ?

అ మృణాళిని కావాలంది వీణ

బె నీ వీణా !

అ ఇంక నాకెందుకీ వీణ ?

(ఆమె వీణతీసుకుని వెళ్ళబోతుంది. బెనర్జీ నిట్టూర్చి ఏదో తల్చుకుంటూ నిలబడతాడు. దీపాలు సన్నగిల్లి ఆరిపోతాయి.)

* * *

(దీపాలు క్రమంగా వెలుగుతాయి. పూర్ణిమ పక్కదులిపి వేయబోతుంటుంది.)

గో పక్క నేను వేసుకుంటానమ్మగారూ!

పూ ఫర్వాలేదయ్యా !

గో చూడండమ్మగారూ ! మీ చేత శుశ్రూష చేయించుకోడానికి నేను రాలేదు. మీ యింట్లో నేనుండేది ఈ ఒక్కరోజు. ఈ నాలుగు గడియల్లోనూ జరిగినదంతా తు. చ తప్పకుండా కాశీకి నేను చెప్పాలి. మీతోనూ, బాబుగారితోనూ కాస్సేపు కూర్చుని మాట్లాడ్డానికే నా కవకాశం దొరకడంలేదు.

పూ అవకాశాని కేముంది ? ఈ యిల్లూ వాకిలీతప్ప పై ప్రపంచం ఏమీ తెలియదు నాకు.

గో ఓహో ! అయితే నాబోటి చదువుకున్న కుర్రవాళ్ళకి పై ప్రపంచకం సంగతులు తప్ప మరేమీ రుచించవంటారు,

పూ : అందుకోసంకాదు. నేను నీకు కొత్తగా చెప్పదగిన విశేషాలేమున్నాయి ?

గో . లేకేం ? అన్నిటికన్న ముఖ్యమైన విషయమే ఉందిగా — కాశీ సంగతి మాట్లాడ్డం. అంతకన్న మీకూ నాకూ రుచించే విషయం మరొకటేముంటుంది. ?

పూ (నిట్టూర్చి) అయ్యో ! నా తెలివి ఆయనికి మందివ్వలేదు.

గో : బాబుగారింట్లోలేరండి. మీరు మర్చిపోయినట్లున్నారు.

పూ ఆయనొచ్చేసరికి సిద్ధంగాఉంచొద్దూ ఇప్పుడే వస్తాను. అదిగో మాటలోనే వచ్చారు. మీకు మందు తెస్తా (బెనర్జీ వస్తాడు.)

బె : మందా ? ఓహో ! మందా... !

పూ . పట్టుకొస్తా.

బె : అక్కర్లేదు. నేనేవచ్చి తాగుతానే పడుకోబోయేముందుగదా— (పూర్ణిమ వెళ్ళిపోతుంది. బెనర్జీ వెళ్ళి తన కుర్చీలో కూచుంటాడు. ఒకపత్రిక తీసి చదవబోతాడు)

గో . నేను రేపు ఉదయం రైలుకి వెళ్ళాలండి.

బె · ఆఁ వెళ్ళాలా ?

గో . ఎల్లుండి డ్యూటీలో చేరాలి.

బె : మంచిదినాయనా ! ఒచ్చిమాయింట్లో వున్నావు. అదే సంతోషం. ఇంక

పడుకో నాయనా! పొద్దు పోయి నట్లుంది.

గో : మాకుప్రొద్దుపోవడం ఏమిటండి? అసలు రాత్రి పగలు కూడా తేడా లేదు మాకు.

బె : ఏమిటినాయనా, ఏమిటన్నావు?

గో : బాబుగారూ! మీరెప్పుడూ యింత పరధ్యానంగానే వుంటారా?

బె : వయస్సయిపోయిందిగదా నాయనా!

గో : మీ అంత చలాకీగా అన్ని విషయాల్ని గురించి మాటాడగల మనుషులు చాలా అరుదంటాడు మా కాశీ_మీ పరధ్యానం చూస్తే నా కాశ్చర్యం వేస్తోంది.

బె : ఒంట్లో అంత బాగాలేదు నాయనా. నేనువెళ్ళి పడుకుంటాను. (బెనర్జీ వెళ్ళిపోతూండగా అపర్ణ ఒక కూజాతో నీళ్లుతెచ్చి బల్లమీద పెడుతుంది.)

అ : మీ కింకేమన్నా కావాలా?

గో : కావాలి. (అపర్ణ అతనికేసి తిరుగుతుంది.) మీరలా కూర్చోవాలి. (ఆమె అనుమానిస్తుంది) నేను సైనికుణ్ణి కనుక మర్యాద నతిక్రమిస్తానని మీ కనుమానముంటే వెళ్ళిపొండి

అ : ఎందుకలా అంటున్నారు?

గో : మీరంతా నన్ను పరాయి ప్రాణిలా ఎందుకు చూస్తున్నారు?

అ : మీకేమన్నా లోపం చేశామా?

గో : అపర్ణాదేవీ? మీ రేమీ లోపంచెయ్యలేదు. పైగా అనవసరమైనంత శ్రద్ధ చూపిస్తున్నారు. కాని ఈ ఆతిథ్యంలో ఆదరం, అనురాగం లోపించినట్టు నా కర్థమౌతోంది.

అ : అది పొరబాటు.

గో : పొరబాటే. ఇది నా యిల్లనుకోవడం, మీరంతా నా వాళ్ళనుకోవడం పెద్ద పొరబాటు.

అ : మీ మనస్సుకు కష్టం కలగడం నిజంగా మా దురదృష్టం. మామయ్యా అత్తయ్యా మిమ్మల్ని మా యింట్లో మనిషిగానే అనుకుంటున్నారు. నాకు తెలుసు.

గో : అయితే మీరు మాత్రం నన్ను అనవసరంగా యింట్లోదిగిన అతిథి ననుకుంటున్నారా?

అ : లేదు...మీరు...మా...బావకి...

గో : ప్రాణస్నేహితుణ్ణి - మాకు శరీరాలు రెండుగాని ప్రాణం ఒకటే.

అ. ప్రాణం ఒకటే (ఎక్కడో ఆలోచిస్తున్నట్టు అంటుంది.)

గో : మా యిద్దరి మధ్య దాపరికాలు లేవు. మీరు వ్రాసిన ఉత్తరాలైనా సరే_నా కతను చదివి వినిపిస్తాడు. మీరో కొత్తపాట తయారు చేసుకున్నారట. మీ దగ్గర నేర్చుకునొచ్చి తనకు వినిపించాలన్నాడు. నా కాపాట నేర్పరూ?

అ: పాటా! నేను పాడలేను. నా గొంతు యింక పలకదు (అపర్ణ తొందరగా వెళ్ళిపోతుంది. గోపాలరావుకి యిదేమీ అర్థం కాక చూస్తుంటాడు. దీపాలు సన్నగిల్లి పోతాయి.)

* * *

(మళ్ళీ దీపాలు వెలుగుతాయి. గోపాలరావు చొక్కా తొడుక్కొని బొత్తాలు పెట్టుకుంటూ వుంటాడు.)

బె: కాఫీ, టిఫిన్ అయిందా నాయనా!

గో: అయిందండి.

బె: (ఒక రిస్టువాచీ ఇస్తూ) నీ చేతికి లేదుగా యుద్ధరంగంలో ఒంటరిగాడవై పోయినప్పుడు, యిదన్నా నీకు తోడుగా వుంటుంది.

గో: కాళీ ఎప్పుడూ నాదగ్గరే ఉంటాడు. నేనెన్నటికీ ఒంటరిగా ఉండను.

బె: యుద్ధంలో ఏ క్షణాన ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? నీ కవసరం లేదని తోస్తే అవసరమున్న తోటిసైనికుడి కెవరికన్నా ఇయ్యి నాయనా!

(పూర్ణిమవచ్చి తన భుజంమీద శాలువాతీసి యిస్తుంది.)

పూ: బాబూ యిది తీసుకెళ్ళు.

గో: అమ్మగారూ! మీరు కప్పుకునేది—

పూ: నాకంటె పీటిఅవసరం మీకెక్కువ నాయనా! ఇంకేం చెప్పొద్దు.

గో: నాకోరగ్గుంది. పోనీ మీరిచ్చారని కాళీ కిస్తాను.

బె: అక్కర్లేదు నాయనా! హాడికి అవసరముండదు.

పూ: వాడేమిటి నువ్వేమిటి, అక్కడ యుద్ధం చేస్తున్న వాళ్ళంతా మా బిడ్డల్లాంటివాళ్ళే - ఏదో మమకారం కొద్దీ అనుకోడంతప్ప.

బె: మేం ముసలాళ్ళం నాయనా! ఎన్నో

చాదస్తాలుంటాయి. మేం ఏంచేసినా నువ్వేమీ మనస్సులో పెట్టుకోవద్దు.

గో : బాబుగారూ ! నిన్నరాత్రి అపర్ణతో నే నన్న మాటలు మీకు కష్టం కలిగించి నట్టున్నాయి.

బె : అపర్ణతోటా ? నువ్వేమన్నావో నాకు తెలియదు. అయినా మాకు తెలీకుండానే కొన్నిలోటుపాట్లు జరిగుంటాయని నాకు తెలుసు. అందుకోసం అన్నాను.

గో : బాబుగారూ ! మాకాశీ తలిదండ్రులు మీరు. నాకూ తల్లిదండ్రులే తలిదండ్రులకీ బిడ్డలకీ మధ్య లోటుపాట్ల ప్రశంసే వుండదు. నాకింక శలవిప్పిస్తారా !

బె : ఒక్కక్షణం ఆగునాయనా ! అపర్ణ ఏదో కానుక్కొవడానికి బజారు కెళ్ళింది. ఒచ్చేస్తుంది.

గో . ఈ కానుకలతో నన్నుచాలా మొగమాట పెట్టేస్తున్నారు.

బె : నాయనా ! తలిదండ్రులకీ బిడ్డలకి మధ్యకానుకల ప్రశంసమాత్రం ఎందుకుంటుంది ? పది రోజులపాటు అన్నిబాధలూ మర్చిపోయి బంధువులమధ్య ఆప్తులమధ్య ఆనందంగా వుండాలని వచ్చావు. మావంటివారికోసం ప్రాణత్యాగానికైనా వెనుదీయక యుద్ధరంగంలోకి మళ్ళీ దూకపోతున్నావు. ఈ శలవుదినాలు నీ కెంతో విలువైనవి. అవి వ్యర్థం కాకూడదన్నాఆత్రం మా కెంతైనావుంది. అయితే మేము ఎంతవరకు నిన్ను సుఖపెట్టామో నా కనుమానంగానేవుంది.

గో : బాబుగారూ ! మీ రింతదూరం నాకు చెప్పనక్కర్లేదు.

పూ : నాయనా ! కన్నబిడ్డల్ని యుద్ధరంగంలోకి పంపించి అన్నిప్రాణాలూ వాళ్ళమీదే పెట్టుకున్న తల్లి దండ్రు లీదేశంలో ఎంతోమంది వున్నారు. అందులో మేము కూడా ఒకళ్ళమని నీకు గుర్తుంచేచాలు నాయనా !

గో : మిమ్మల్నెల్లా మర్చిపోగల నమ్మగారూ! మా కాశీ తలిదండ్రులు మీరు.

బె : అదిగో అపర్ణ.

అ : గోపాలరావుగారూ ! ఈ ట్రాన్సిస్టరు రేడియో మీకోసం తెచ్చాను.

గో : నా కోసమా ! మీ బావకోసమా. అపర్ణాదేవీ !

అ : మీ యిద్దరికీ బే ధ మే లే ద ని మీరే అన్నారుగా?

గో : అవును. ఇద్దరం ఒకరిప్రక్క ఒకరం పడుకుని ఉంటాంలెండి. నే నసలు ఈ బహుమానాలకోసమే యిక్కడకు వచ్చినట్టుంది.

బె : లేదునాయనా ; నువొచ్చింది మా కాశీకోసం. ఇవన్నీ మేము నీకిస్తున్నది కూడా — ఒకరకంగా కాశీకోసమే.

గో : ఆమాటకి నేనింకేమీ సమాధానం చెప్పలేను. అమ్మా వెళ్ళొస్తానమ్మా ?

పూ. భగవంతుడు నీకు దీర్ఘాయువు ఇవ్వాలినాయనా! వెళ్ళిరా!

గో: ఇన్ని బహుమానా లిచ్చారుగాని, అసలు బహుమానంసంగతి మర్చే పోయారు.

బె. ఏమిటది?

గో: మీ రెవ్వరూ కాశీకి చెప్పవలసిన మాటలేవీలేవా?

(ముగ్గురూ కొంచెం ముఖాలు త్రిప్పుకుంటారు.)

నేను కనబడగానే కౌగలించుకుంటాడు. మా అమ్మేం చెప్పింది; నాన్నేం చెప్పారు, అపర్ణేంచెప్పిందని అడుగుతాడు నేనడగలేదు – వాళ్ళు చెప్పలేదంటే అతని మనస్సెంత నొచ్చుకుంటుందో మీకు తెలియదా?

(అతను తన ధోరణిలో మిగతావాళ్ళని అట్టే పరీక్షచేయకుండా చెప్పుకుంటూ ఒక ప్రక్కకొస్తే – బెనర్జీ, అపర్ణ పూర్ణిమకు చెరో ప్రక్కకి వస్తారు. ఇంక ఆపుకోలేక పూర్ణిమ బావురు మంటుంది.)

పూ: (ఏడుస్తూ) వాడు నిన్నింకేమీ అడగడు నాయనా! (బెనర్జీ, అపర్ణ, చెరో ప్రక్కన ఆమెనుపట్టుకుంటారు.)

గో: అమ్మా...బాబు గారూ?!...కాశీ అయితే కాశీ.

బె: ఇకలేడు నాయనా! మొన్నరాత్రి తెలిసింది.

గో: కాశీ....(వెక్కి-వెక్కి ఏడుస్తాడు.)

బె: మా గుండెల్లో బాధ నీకేమాత్రం తెలియకుండా ఉండాలని ఎంతో ప్రయత్నించాం. కాని మావల్ల కాలేదు. నీ శలవల్లో అఖరి రోజు

ఈ విధంగా ముగియడానికి కారణం— దీనికి మా బలహీనమే నాయనా !

గో : మీరా బలహీనులు బాబుగారూ ! ఏ మహావీరుడూ ఏ యుద్ధరంగం లోనూ ప్రదర్శించలేని అమానుష మైన ధైర్యం, జీవితరంగంలో ప్రదర్శించిన అజ్ఞాతశూరులు. మీరా బలహీనులు ? ఒక్కగానొక్క బిడ్డని, అందులోనూ మా కాశీవంటి బిడ్డని చైనా పెనుభూతం బలిగొన్నా చలించక, మహా సముద్రమువంటి గర్భశోకాన్ని మనస్సులోనే బిగపెట్టు కుని నావంటి ఒక సామాన్యుడికోసం, పెదవులపై చిరునవ్వు చెదరనీయని మహనీయులు మీరు. మీ నిగ్రహాన్ని మీ చిత్తస్థైర్యాన్ని అపార్థంచేసుకుని మీ మహత్వానికి అపచారంచేసిన మూర్ఖుణ్ణి. నన్ను మన్నించండి. (గోపాలరావు ఆ దంపతుల కాళ్ళ మీద పడతాడు. బెనర్జీ, పూర్ణిమ అతన్ని చెరొక్కచెయ్యి పట్టుకు లేవ నెత్తుతారు.)

పూ : లే తండ్రీ !...మా కాశీ చచ్చిపో లేదు నాయనా ! నువ్వే మా కాశీవి.

బె : నాయనా ! కాశీ !

గో : బాబుగారూ ! (గోపాలరావు అతన్ని కౌగలించుకుంటాడు.)

బె : వెళ్ళునాయనా ! చైనా దురంత కులను దేశంపొలిమేర అవతలకి తరిమివేసి తిరిగిరా నాయనా ! వెళ్లు.

గో : వెడతాను. దురాక్రమణ పరులను చీల్చి, చెండాడి, దేశాన్ని రక్షిస్తాను. ఏ మహత్వం నాటినుండి నేటివరకు మీ వంటి మహాపురుషులలో సజీవ స్రవంతిగా ప్రవహిస్తోందో—ఏ మహత్వం ఈ భారత భూమిని పుణ్య భూమిగా చేసిందో ఆ మహత్వాన్ని ప్రాణాలొడ్డి కాపాడుకుంటాను. (ఈ లోగా అపర్ణ కుంకుమభరిణి తెస్తుంది.)

అ : అన్నా !

గో : చెల్లీ !

అ . (అతనికి కుంకుమతో తిలకంపెట్టి) ఈ వీరతిలకం నీకు శ్రీరామరక్ష కావాలి.

గో : చెల్లీ ! నీ బావను బ్రతికించి తేలేను. కానీ అతని అకాలమరణానికి కారకులైన దుండగులను సమూ లంగా దునుమాడి మీరుణం తీర్చు కుంటాను.

జై హింద్

(గోపాలరావు వెళ్ళిపోతాడు. ముగ్గురూ గంభీరమైన ముఖాలతో అతను వెళ్ళినవైపు చూస్తూ నిలబడతారు.)